

ఏఈ జాబ్ వదులుకుని సివిల్స్ సాధించాడు

- యూపీఎస్సీ పరీక్షల్లో 988వ ర్యాంకు సాధించిన సురేష్



నారాయణవనం/పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):ఐఏఎస్ అధికారి కావడం కోసం జెన్‌కోలో ఏఈ ఉద్యోగం వదులుకున్న సురేష్ ఏడవసారి అనుకున్నది సాధించారు.ఈ సందర్భంగా మంగళవారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు.

● ఆ ఇద్దరే స్ఫూర్తి

చదివిన చదువుకు ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటే సరిపోతుంది కదా అన్న ఆలోచన అమ్మానాన్నలది.నాకు చిన్నప్పటినుంచీ స్వామి వివేకానంద,మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అంటే ఎంతో ఇష్టం.వారి స్ఫూర్తితోనే సమాజానికి నావంతు మరింత మెరుగైన సేవలందించాలని భావించా.సివిల్స్ వైపు దృష్టి సారించా.ఇంటర్వ్యూ వరకూ వెళ్లగలిగినా ఫలితం లేకుండాపోయింది.దీంతో ఏఈ ఉద్యోగానికి రిజైన్ చేసి సివిల్స్‌పైనే పూర్తి శ్రద్ధ పెట్టా.

కరోనాతో పోరాటం

2020లో ఢిల్లీ వెళ్లిన నాకు దేవుడు పరీక్ష పెట్టాడు. కరోనాతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నా.అమ్మానాన్నకు తెలిస్తే ఆందోళన పడతారని చెప్పలేదు.2021లో మరోసారి కరోనా సోకడంతో ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయటపడ్డా. యాంటీబయాటిక్స్ ఎక్కువ వాడడం వినికిడి సమస్య తెచ్చిపెట్టింది.నా కలకు నాలుగు సంవత్సరాల కాలయాపనకు కారణమైంది.చివరకు ఏడవ ప్రయత్నంలో ఈసారి నా కలను నిజం చేసుకున్నా.

గ్రామచైతన్య ఫౌండేషన్

మా ఊరికి ఏదో ఒకటి చేయాలన్న ఆలోచన నుంచి గ్రామ చైతన్య ఫౌండేషన్ స్థాపించా. శ్రీశైలంలో ఏఈగా పని చేస్తున్నప్పుడు ఆదివాసి పిల్లలు, మత్స్యకారుల పిల్లలు విద్యకు దూరంగా ఉండడం చూసి బాధపడ్డా.వారికి విద్య పట్ల అవగాహన కల్పించాలన్న సత్సంకల్పంతో ఫౌండేషన్ ఏర్పాటు చేశా. అందుకు నాతో పాటు పని చేసే జెన్‌కో ఉద్యోగులు కూడా సహకరించారు. ఈ క్రమంలో సమాజం పట్ల మెరుగైన అవగాహన ఏర్పడింది. సివిల్స్‌లో నా ఆప్షనల్ సబ్జెక్ట్ తెలుగు సాహిత్యం.పుస్తకాలను నిరంతరం చదువుతుంటా.

నారాయణవనం మండల పరిధిలోని గోవిందప్పనాయుడు కండ్రిగలో నివాసముంటున్న రైతు మురగయ్య, మునిలక్ష్మి దంపతుల కుమారుడు పాముూరి సురేష్ మంగళవారం విడుదలైన యూపీఎస్సీ పరీక్షల్లో 988వ ర్యాంకు సాధించారు.మెకానికల్ విభాగంలో నంద్యాలలో డిప్లొమా పూర్తి చేసిన సురేష్..కర్నూలు పుల్లారెడ్డి కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు.2012లో ఏపీ జెన్‌కో ఏఈ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉమ్మడి ఏపీలో మొదటి ర్యాంకు సాధించారు.ఏఈగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ సమాజానికి ఏదైనా చేయాలనే లక్ష్యంతో 2017 నుంచి సివిల్స్ ఎగ్జామ్స్ రాయడం ప్రారంభించారు. 2018లో ఇంటర్వ్యూ వరకు వెళ్లినా అదృష్టం వరించలేదు. 2019, 2020 సంవత్సరాల్లో సివిల్స్ ఫలితాలు నిరాశకు గురిచేశాయి. దీంతో శ్రీశైలంలో ఏఈ ఉద్యోగానికి రాజీనామా చేసి దేశ రాజధాని ఢిల్లీ బాటపట్టారు. పట్టువదలని విక్రమార్కుడిలా ఈసారి 988 వ ర్యాంకు సాధించారు.

'ఆన్‌లైన్' అతిపెద్ద సోర్స్

- సివిల్స్ కోసం ఢిల్లీకి అవసరం లేదంటున్న శ్రీకాంత్



పలమనేరు/తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) :సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో నెగ్గాలనుకునేవాళ్లు ఢిల్లీకి వెళ్లి పెద్దపెద్ద శిక్షణ సంస్థల్లో చేరాల్సిన అవసరం లేదని, అందరికీ అందుబాటులోకొచ్చిన ఆన్‌లైన్ సర్వీసులను శ్రద్ధగా ఉపయోగించుకుంటే సరిపోతుందంటున్నారు రంపం శ్రీకాంత్.ఈ ఏడాది సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 904వ ర్యాంకు సాధించిన శ్రీకాంత్ మంగళవారం సాయంత్రం తిరుపతిలో ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు.

● నాన్న చెప్పిన మాటలతోనే

ఐఏఎస్ కావాలని నాన్న చిన్నతనం నుంచీ చెప్పేవారు. అయితే నేను పెద్దగా ఫోకస్ చేయలేదు. ఇంటర్మీడియట్ వరకు పలమనేరులోనే చదివా. ఆ తర్వాత హైదరాబాదులో ఇంజనీరింగ్, బెంగుళూరులో ఎంబీఏ పూర్తి చేశా. గూగుల్, అమెజాన్ వంటి సంస్థల్లో పనిచేస్తున్నప్పుడు నాన్న చెప్పిన మాటలు మళ్లీ గుర్తుకు వచ్చాయి. పదేపదే ప్రేరణగా వినిపించాయి. సివిల్స్‌కు ఎంపికవ్వాలని నిర్ణయం తీసుకున్నా.ఓవైపు ఉద్యోగం చేసుకుంటూనే మరో వైపు సివిల్స్‌పై దృష్టి పెట్టా. ఎలాంటి శిక్షణ తీసుకోలేదు.నాలుగుసార్లు పట్టువదలకుండా ప్రయత్నిస్తే ఈసారి అవకాశం వచ్చింది.

● ఆన్‌లైన్ వాడుకుంటే చాలు

సివిల్స్ పరీక్షలు రాయాలనుకునేవారు ఆన్‌లైన్‌లో దొరికే కంటెంట్ వాడుకుంటే సరిపోతుంది.దాంతో పాటు ఎవరైనా మెంటార్ దగ్గర మెలకువలు తెలుసుకోండి. నేను ఆ పనిచేయలేకపోవడం వల్ల నాలుగుసార్లు ప్రయత్నించాల్సి వచ్చింది.కరెంట్ ఎఫైర్స్‌పై అవగాహన పెంచుకోవడం, రెగ్యులర్‌గా న్యూస్ పేపర్లను చూడడం అలవాటు చేసుకోవాలి. నావరకు నేను ఇదే పద్ధతి అనుసరించా.



తల్లిదండ్రులు,సోదరి,భార్యతో శ్రీకాంత్

ఈ ఏడాది సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 904వ ర్యాంకు సాధించిన శ్రీకాంత్ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బైరెడ్డిపల్లె వాసి.ఈయన తండ్రి నాగరాజు ప్రధానోపాధ్యా యుడిగా పని చేసి రిటైరవగా తల్లి రేణుక గృహిణి. ఉద్యోగరీత్యా శ్రీకాంత్ తల్లిదండ్రులు పలమనేరులో స్థిరపడ్డారు.పాఠశాల విద్యాభ్యాసం పలమనేరులో, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ హైదరాబాద్ సీబీఐటీలో, బెంగళూరు ఐఐఎంలో ఎంబీఏ పూర్తి చేసిన శ్రీకాంత్ గూగుల్ కంపెనీలో డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్‌గా పని చేస్తూ ఎవరి వద్దా శిక్షణ తీసుకోకనే సమగ్ర ప్రణాళికతో నిర్విరామంగా కృషిచేసి సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో ఉన్నతమైన ర్యాంక్ సాధించారు. శ్రీకాంత్ సోదరి మధురిమ గైనకాలజిస్టుగా బెంగళూరులో పని చేస్తున్నారు. తిరుపతి జిల్లా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోత్స్న కుమార్తె శ్రావ్యను శ్రీకాంత్ ఐదేళ్ల క్రితం పెళ్లాడారు. శ్రావ్య ప్రస్తుతం బెంగళూరులోని టార్గెట్ కంపెనీలో ఫైనాన్స్ మేనేజర్‌గా పని చేస్తున్నారు.వీరికి మూడేళ్ల పాప వుంది.

వేడెక్కిన కుప్పం

మున్సిపల్ చైర్మన్ కుర్చీకోసం తీవ్ర పోటీ ● 28న చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్



కుప్పం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో రాజకీయం వేడెక్కింది. ఈనెల 28న కుప్పం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో పోటీదారుల్లో తీవ్రమైన ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో కలెక్టర్‌ను కలవడానికి మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు మంగళవారం చిత్తూరు వెళ్లారు. మరో వైపు విజయవాడలో ఉన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బయలుదేరి తిరుపతిదాకా వచ్చారు. ఇంకోవైపు వైసీపీ ఎమ్మెల్సీ, చంద్రబాబుపై పోటీచేసి ఓడిన వైసీపీ నాయకుడు భరత్ కుప్పం చేరారు. అటూఇటూ కూడా రాజకీయాలు వేడెక్కాయనడానికి ఇది నిదర్శనం. కుప్పం మున్సిపాలిటీలో 25 వార్డులుండగా గత ఎన్నికల్లో వైసీపీ అధికారంలో ఉండడంవల్ల 18 వార్డులను గెలుచుకుంది. 16వ వార్డు అభ్యర్థి అయిన డాక్టర్ సుధీర్‌ను చైర్మన్ చేసింది. టీడీపీ కేవలం 6 వార్డులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే గతేడాది నవంబరు 6వ తేదీన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ పదవితోపాటు, కౌన్సిలర్ పదవికి కూడా సుధీర్ రాజీనామా చేశారు. అంతకు కొన్ని రోజులముందే టీడీపీలో చేరడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో చైర్మన్ కుర్చీతోపాటు 16వ వార్డు కౌన్సిలర్ పదవి కూడా ఖాళీ ఏర్పడింది. ఆయనకన్నా ముందే ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకుని, అందులో ఒకరు తిరిగి పాత గూటికి చేరిపోయారు. అంటే ప్రస్తుతం కుప్పం మున్సిపల్ కౌన్సిల్‌లో 10 మంది టీడీపీ, 14 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉన్నారు.

● ఎవరి ప్రయత్నాల్లో వారు

టీడీపీ కౌన్సిలర్లలో మున్సిపల్ చైర్మన్ కుర్చీకోసం తీవ్రమైన పోటీ నెలకొంది. ఖాళీగా ఉన్న 16వ వార్డుకు కూడా ఎన్నికలు నిర్వహించి ఉంటే అక్కడ గెలిచిన అభ్యర్థినే చైర్మన్ పదవి వరిస్తుందన్న భావన ఇటీవలిదాకా కొనసాగింది. అయితే ఆ వార్డుకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో ప్రస్తుతం ఉన్న 10 మంది టీడీపీ కౌన్సిలర్లలోనే పోటీ పెరిగింది. మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా కొనసాగుతున్న వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన 19వ వార్డు కౌన్సిలర్ జిమ్ దాము, బలిజ సామాజిక వర్గానికి చెందిన ఎస్.సోమశేఖర్, వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన సెల్వరాజ్ ముందు వరుసలో ఉన్నారు. వీరిలో జిమ్ దాము, సెల్వరాజ్ ఇటీవల కులసంఘాల సమావేశాలు ఏర్పాటు చేసి బలనిరూపణకు ప్రయత్నించారు. సోమశేఖర్ అటువంటి ప్రయత్నాలేమీ చేయలేదు కానీ, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నాన్నే నమ్ముకున్నారు. పీఎస్ఎం వర్గంగా మొదటినుంచి కొనసాగుతుండడంతో సైలెంట్‌గా ఆయన ద్వారా తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు. వైసీపీనుంచి టీడీపీలోకి జంప్ అయిన నలుగురు కౌన్సిలర్లు కూడా తమలో ఒకరికి చైర్మన్ పదవి ఇవ్వాలని అక్కడా ఇక్కడా చెప్పుకుంటూ తిరుగుతున్నారు. అయితే టీడీపీలో మొదటినుంచి కష్టపడినవారికే పదవులు, అవకాశాలు ఉంటాయని అధినేత చంద్రబాబు చాలాసార్లు స్పష్టంగా చెప్పడంతో టీడీపీ కౌన్సిలర్లలో ఎవరో ఒకరికి మున్సిపల్ చైర్మన్ పదవి లభించే అవకాశమే అధికంగా ఉంది. అధిష్ఠానం మాత్రం ఈ విషయంలో గుంభనంగా ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన కంగుందిలోని పీఎస్ఎం ఫాం హౌస్‌లో జరిగిన రహస్య సమావేశంలో మున్సిపల్ చైర్మన్ విషయంలో అధినేత చంద్రబాబుదే తుది నిర్ణయమని, ఎమ్మెల్సీ కంచర్ల స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. చైర్మన్ అభ్యర్థి పేరు సీల్డ్ కవర్‌లో పంపుతారని, దాన్ని ఆమోదించి తీరాలని కూడా ఈ సమావేశంలో పార్టీ పెద్దలు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్‌గిరీ ఎవరిని వరించనుందన్న విషయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

● కోరం ఉండాలంటే

మున్సిపల్ చైర్మన్ పదవికి ఎన్నిక జరిగితే 16వ వార్డు ఖాళీగా ఉంది కాబట్టి 24 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులుగా టీడీపీ, వైసీపీ ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భరత్.. మొత్తం కలిపి 26 మంది సభ్యులవుతారు. కౌన్సిల్ సమావేశ నిర్వహణకు అవసరమైన కోరం ఉండాలంటే కనీసం 13మంది కౌన్సిలర్లు హాజరు కావాల్సి ఉంటుంది. ఇప్పటికే టీడీపీకి 10 మంది కౌన్సిలర్లున్నారు. అంటే ఇంకా ముగ్గురు కౌన్సిలర్లు అవసరమవుతారు. ఇందులో ఎమ్మెల్సీ కంచర్ల ఎక్స్ అఫిషియో సభ్యుడిగా హాజరైతే ఈ సంఖ్య రెండుకు తగ్గుతుంది. ఆ ఇద్దరినీ ఇటువైపు లాక్కోవడమో లేక ఏదైనా కారణంవల్ల మొత్తం వైసీపీ కౌన్సిలర్లు హాజరు కాకుండా ఉండడమో జరిగి తీరాలి. ఈ రెండు పద్ధతుల్లో ఏ పద్ధతి ఎంచుకుంటారన్నది అధికార పార్టీ ఇంకా తేల్చుకోలేదని తెలుస్తోంది. మొన్న రామకుప్పంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల్లో గెలిచి కూడా చివరి నిమిషం వరకు ఉత్కంఠను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రతిష్ఠాత్మకమైన కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో అటువంటి పరిస్థితి పునరావృతం కావద్దని అధినేత చంద్రబాబు, స్థానిక నాయకత్వాన్ని హెచ్చరించినట్లు సమాచారం. చివరకు ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

ఇప్పుడు ఎస్సీల వంతు!

- చిత్తూరు,తిరుపతి జిల్లాలకు 2,221యూనిట్లు మంజూరు
- స్వయం ఉపాధికి మే 10దాకా దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):వైసీపీ ప్రభుత్వ హయాంలో సబ్సిడీ రుణాలకు నోచుకోని బడుగు, బలహీన వర్గాల వారికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆశలు చిగురించాయి. ఇందుకు తగ్గట్లే అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే పెద్దఎత్తున బీసీలకు సబ్సిడీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసింది. వారిలో చాలా మందికి సంబంధించి రుణాలు గ్రౌండింగ్ కాగా.. మరి కొంతమందికి సంబంధించిన రుణాల పురోగతి వివిధ స్థాయుల్లో ఉంది. ఇప్పుడు ఎస్సీల వంతు వచ్చింది.చిత్తూరు ,తిరుపతి జిల్లాల పరిధిలో 2,221 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.ఇందులో గ్రూపులకు డ్రోన్లు, ఆటోలు, ట్రక్కులు, కార్లు, ఫ్లవర్ బొకే తయారీ, ఎల్ఈడీ బల్బులు, ప్లంబింగ్, వాటర్ బాటిళ్ల రీసైక్లింగ్, ఈవీ బ్యాటరీ స్టేషన్లు, మొబైల్ రిపేర్లు, సోలార్ ఎనర్జీ, సోలార్ ప్యానెల్, ఫొటో, వీడియో, వెల్డింగ్, మొబైల్ కార్ వాషింగ్, బేకరీ, బ్రిక్స్ తదితర 32 రకాల యూనిట్లను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలకు అవకాశముంది. రూ.3 లక్షల్లోపు రుణాలకు 60 శాతం రాయితీ, రూ.10 లక్షల్లోపు రుణాలకు 40 శాతం రాయితీ, ట్రాన్స్‌పోర్టు రంగంలో రూ.3 లక్షల్లోపు రుణాలకు 50 శాతం రాయితీ ఉంటుంది. చిత్తూరు జిల్లాకు 954 యూనిట్లను మంజూరు చేసింది. ఇందులో రూ.15.70 కోట్ల సబ్సిడీ, రూ.1.99 లబ్ధిదారుల వాటా, రూ.39,82 కోట్లు బ్యాంకు వాటాగా ఉంది. అలాగే తిరుపతి జిల్లాకు 1267 యూనిట్లను కేటాయించింది. ఇందులో రూ.20.88 సబ్సిడీ, రూ.2.64 కోట్ల లబ్ధిదారుడి వాటా, రూ.52,89 కోట్లు బ్యాంకు రుణంగా ఇస్తారు.

● దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారై 21 నుంచి 50ఏళ్లలోపు వయసు కలిగిన వారై వుండాలి. గత ఐదేళ్ల నుంచి ఎస్సీ కార్పొరేషన్ నుంచి ఎలాంటి రుణం తీసుకొని ఉండకూడదు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలి. ఆసక్తి కలిగిన లబ్ధిదారులు వచ్చేనెల 10వ తేదిలోపు http://apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చెన్నయ్య తెలిపారు.

ఆ 25 బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాద నివారణ ఏర్పాట్లు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పాల్గొన్న ఎస్పీ మణికంఠ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జాతీయ రహదారులపై గుర్తించిన 25 బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.కలెక్టరేట్‌లో మంగళవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఇందులో ఎస్పీ మణికంఠ పాల్గొన్నారు. బ్లాక్ స్పాట్స్ దగ్గర్లో అత్యవసర వైద్యసేవలు అందించేందుకు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న డాక్టర్లు, వారి ఫోన్ నెంబర్లు, బ్లడ్ గ్రూప్ వివరాలు, అంబులెన్స్ తదితర వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు.ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఈ వివరాలు ఉపయోగపడతాయన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో సమస్యాత్మక జంక్షన్లు, స్కూల్ జోన్స్, కాలేజీలు, ఆస్పత్రుల వద్ద స్పీడ్ బ్రేకర్ల లైటింగ్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. 2025 జనవరి నుంచి మార్చి వరకు 179 రోడ్డు ప్రమాద కేసులు నమోదు కాగా, వాటిలో 86 మంది మృతి చెందారన్నారు. జిల్లా నుంచి తిరుపతి వెళ్లే రహదారులపై ముందస్తు సూచికబోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జాతీయ రహదారుల వెంట క్రాసింగ్ రోడ్స్‌కు ముందుగానే తిరుపతికి వెళ్లే మార్గాలను సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారుల వెంట అక్రమంగా రోడ్డు దాటేందుకు (ఇల్లీగల్ క్రాసింగ్) ఏర్పాటు చేసిన రోడ్లను మూసివేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారులవెంట రాత్రివేళల్లోనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలను వేగవంతం చేయాలన్నారు. వేసవి సెలవుల దృష్ట్యా ద్విచక్ర వాహనాలపై స్నేహితులతో కలిసి ప్రయాణించడం, అతివేగం ప్రమాదాలకు కారణాలని పిల్లలకు తల్లిదండ్రులు తెలియజేయాలన్నారు. డీటీసీ నిరంజన్‌రెడ్డి, డీఎంహెచ్‌వో సుధారాణి, డీపీవో సుధాకరరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

13, 14తేదీల్లో చిత్తూరు గంగజాతర

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13, 14తేదీల్లో చిత్తూరు నడివీధి గంగజాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సీకే లావణ్యబాబు, హేమంత్‌కుమార్‌తెలిపారు. మంగళవారం పొన్నియమ్మ ఆలయంలో మీడియాతో మాట్లాడుతూ మే 6న గంగజాతర నిర్వహణకు చాటు కార్యక్రమం, 7 నుంచి 12 వరకు అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాలు, పూజలు, 13వ తేది వేకువజామున అమ్మవారికి జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతర సందర్భంగా అమ్మవారికి భక్తులు సమర్పించే అంబలి, బలికూడులను ఎప్పటికప్పుడు భక్తులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. 14వ తేది సాయంత్రం అమ్మవారిని కట్టమంచి చెరువులో నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా నగరంలో గిరింపేట, ప్రశాంత్‌నగర్, కట్టమంచి, మురకంబట్టు, మంగసముద్రం, సంతపేట, గంగనపల్లె, కొంగారెడ్డిపల్లెల్లో మే 13, 14 తేదీల్లో నడివీధి గంగజాతర్లు జరుగనున్నాయి.

తిరుమలలో తమిళనటుడు విజయ్‌కుమార్



తమిళ సినీనటుడు విజయ్‌కుమార్ మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుమార్తె, నటి శ్రీదేవి, కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం బయట నటి శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది కుటుంబ సభ్యులతో తిరుమలకు రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. నారా రోహిత్‌తో నటించిన 'సుందరకాండ' త్వరలో విడుదల కాబోతోందని చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మాడవీధుల్లో చల్లదనం కోసం..



ఆలయం ముందు నీళ్లు వదులుతున్న ట్యాంకర్

చల్లని తిరుమల కొండ కూడా ఎండకు వేడెక్కిపోతోంది. మాడవీధుల్లో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీటీడీ ఇప్పటికే కూల్‌పెయింట్ వేసింది. తాత్కాలిక షెడ్లు నిర్మించింది. మాడవీధుల్లో గ్యాలరీల వెంబడి గ్రీన్ తెరతో పైకప్పులను ఏర్పాటు చేశారు. అయినా బండలు పరిచిన నేల సెగలు కక్కుతూనే ఉంది. దీంతో ప్రతి రెండు గంటలకోసారి ఆలయ నాలుగు మాడవీధులు, పరిసర ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని నిరంతరాయంగా చల్లుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.79కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,937

తలనీలాలు సమర్పించినవారు: 24,157



● నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

పుస్తకం చిన్నబోతోంది..



నడిపేది..నడిపించేది.. పెను నిద్దుర వదిలించేది.. సమగ్ర వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది.. నిరంతరం మార్పు వైపు నడిపించేది పుస్తకం. నిజమే కానీ నేటి ఆధునికత పుస్తకాన్నీ ప్రభావితం చేస్తోంది. చదువరులను తగ్గించేస్తోంది. పుస్తక పఠనమే వ్యక్తిగత అభివృద్ధికి సోపానమనే విషయాన్ని విస్మరిస్తోంది. తద్వారా నేటి యువత చాలా నష్టపోతోందని పలువురు రచయితలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పుస్తకాన్ని దగ్గరకు తీసుకోవాల్సిన అవసరాన్ని వీరు నొక్కివక్కాణిస్తున్నారు. పఠనంతో మంచి జీవితానికి బాటలు వేసుకోవచ్చునని హితవు పలుకుతున్నారు. పుస్తకాలను పక్కకు నెట్టి ఎలక్ట్రానిక్ పరికరాలతో కాలక్షేపం చేస్తే భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వీటికి అతుక్కుపోయి ఒత్తిడి, మానసిక సమస్యలు,అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని గుర్తు చేస్తున్నారు. బుధవారం ప్రపంచ పుస్తకదినోత్సం సందర్భంగా పలువురు రచయితలు ఏమంటున్నారంటే...


- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

తలదించుకుని చదివితే తలెత్తుకునేలా....

పుస్తకాన్ని తలదించుకుని చదివితే జీవితాంతం తలెత్తుకునేలా చేస్తుంది. చదివేకొద్దీ జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించడానికి గత రెండు సంవత్సరాలుగా బాలల నేస్తం పేరుతో మాసపత్రికను రూపొందిస్తున్నాం. ఇందులో పిల్లలు రాసిన బాలసాహిత్య కథలు, గేయాలు, చిత్రాలు సృజనాత్మకత అంశాలతో ఎందరో విద్యార్థులను పఠనం వైపు తీసుకెళ్తున్నాం. పిల్లలకు కథల ద్వారా లోకంలో ఉన్న మంచి చెడులు తెలుస్తాయి. పుస్తక పఠనం దినచర్యలో భాగం కావాలి.

- యువశ్రీ మురళి, అరసం జిల్లా అధ్యక్షులు

వ్యక్తిత్వం, విలువలు పెరుగుతాయి...



పుస్తక పఠనం వల్ల మనిషిలోని వ్యక్తిత్వం, విలువలు పెరుగుతాయి. జీవిత చరిత్రలు చదివితే మనిషి మనిషిగా ఎదగడమే కాక తనను తాను మంచి వ్యక్తిగా తయారు చేసుకుంటాడు. గతంలో గ్రంథాలయాలకు వెళ్లి ఇతిహాసాల నుంచి అనేక రకాల పుస్తకాలను చదవడం వల్ల ధర్మం నాలుగు పాదాలపై నిలబడిందనుకుంటాను. ఇప్పుడు ఇంట్లో అందరూ సెల్‌ఫోన్లు పట్టుకుని తమ లోకంలో ఉండిపోతున్నారు. దీనివల్ల పిల్లలకు కంటిచూపు దెబ్బతింటోంది. కళ్లజోళ్ల పరిస్థితి వస్తోంది

- పేరూరు బాలసుబ్రహ్మణ్యం, కథా రచయిత



పుస్తక పఠనం అదృష్టం

విద్యార్థుల్లో పుస్తకాలు చదవడం తగ్గిపోయింది. ఇది చాలా బాధాకరం. పుస్తక పఠనం వ్యక్తిని ఎప్పుడూ చురుకుదనంతో ఉంచుతుంది. నాకిప్పుడు 70 ఏళ్లు. 35 పుస్తకాలు రాశాను. సాహితీవేత్తలతో మమేకమవుతుంటాను. రోజూ ఏదో ఒక పుస్తకం చదవడం వల్ల ఉత్సాహంగా ఉంటున్నాను. చిన్న చిన్న ప్రయాణాల్లో సైతం తోడుగా ఎల్లప్పుడూ పుస్తకాలు ఉంటాయి. పుస్తకాలు చదవడం ప్రతిఒక్కరూ బాధ్యతగా చేసుకోవాలి. పుస్తక పఠనం దక్కిందంటే అదృష్టంగా భావించాలి.

- డాక్టర్ త్యాగదుర్గం మౌని, సాహిత్యవేత్త



తోడు నిలిచే నేస్తం పుస్తకం...

పుస్తకం జ్ఞానాన్ని పెంచే నిధి అక్షరాలను అందంగా దాచుకొన్న తరగని గని. తోడు నిలిచే నేస్తం. కానీ పుస్తక పఠనం నేటి యువతకు దూరమవుతోంది. సెల్‌ఫోన్ వాడటం తప్పుకాదు గానీ దానిని ఎంత వరకు వాడాలో అంతవరకే వాడాలి. తల్లిదండ్రులు చిన్నతనం నుంచి పుస్తక పఠనం వైపు దారి మళ్లించాలి. పిల్లలను సమయం దొరికినప్పుడల్లా మంచి పుస్తకాలను చదివించాలి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వారంతా పుస్తకాల ప్రేరణ పొందారని గమనించాలి.



- మూరిశెట్టి గోవింద్, కథ, నవలా రచయిత







రుయా.. చూపాలిలా దయ

భానుడు చెలరేగిపోతున్నాడు.నిప్పులు చెరుగుతున్నాడు. సాధారణ ప్రజలే ఈ ఎండల తాకిడికి అల్లాడిపోతుంటే మరి రోగుల పరిస్థితి మాటేంటి.. ఈక్రమంలోనే రుయాస్పత్రిలో తీసుకున్న చర్యలు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయి. వీల్ చైర్లు, స్ట్రెచర్లపై రోగులను తీసుకువెళ్లేవారికి ఊరటనిస్తున్నాయి. ఆస్పత్రిలోని అంతర్గత మార్గాల్లో ఎండ తగలకుండా ఏర్పాటు చేసిన పచ్చని పందిళ్లు రక్షణగా నిలుస్తున్నాయి. చెప్పులు కూడా లేకుండా వచ్చే రోగులకు సైతం ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ విధమైన ఆలోచనకు శ్రీకారం చుట్టిన ఆస్పత్రి అధికారులకు రోగులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

సహజ వనరుల వెలికితీతలో అప్రమత్తం

● అంతర్జాతీయ సదస్సులో శాస్త్రవేత్త బలరాం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అరుదైన సహజ వనరుల సద్వినియోగంలో చైనాను మన దేశం అధిగమించవలసి ఉందని హైదరాబాదులోని నేషనల్ జియోలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఐ) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ వి. బలరాం పేర్కొన్నారు. ఎస్వీయూ ఫిజిక్స్- పద్మావతి వర్సిటీ బయో టెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు రెండవ రోజు(మంగళవారం) కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎస్వీయూ సెనేట్ హాలు వేదిక జరిగిన సదస్సులో బలరాం మాట్లాడుతూ మన దేశంలో లభించే అరుదైన మూలకాలను వెలికితీసే, వినియోగించుకునే అంశాల్లో మార్పులు రావాలన్నారు. యురేనియం వంటి సహజ వనరులను వెలికితీసే బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం మంచిది కాదన్నారు. లేకపోతే,ఈ మూలకాల నుంచీ వెలువడే వ్యర్థాలు క్యాన్సర్, కిడ్నీ జబ్బులకు కారణమవుతాయన్నారు. ఢిల్లీ తరహా కాలుష్యాన్ని కూడా ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. హైదరాబాదు బిట్స్ పిలానీ ప్రతినిధి డాక్టర్ బీఎం రెడ్డితో పాటు పలువరు శాస్త్రవేత్తలు, పరిశోధకులు పేపర్, ఓరల్, పోస్టర్ ప్రెజెంటేషన్స్ చేశారు. వీరిని అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ జాన్‌సుష్మా సర్టిఫికెట్, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ దీపేంద్రసింగ్, కార్యదర్శి డాకక్టర్ ఎంఎల్‌పీ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సీకే జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.





సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ బలరాం

నేడు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పర్యటన

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ ఎంపవర్మెంట్, రిలేషన్స్‌శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం తిరుపతి జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం 9గంలకు శ్రీసిటీని సందర్శించి 11.30గంటల వరకు శ్రీసిటీ ఎండీ, శ్రీసిటీ ఎంఎస్‌ఎంఈ, అంబత్తూరు ఇండస్ట్రియల్ తదితర అసోసియేషన్ వారితో సమావేశం అవుతారన్నారు. అనంతరం 2గంటలరే తిరుపతికి బయలుదేరి కలెక్టరేట్‌లో 3 నుంచి 6 గంటల వరకు ఎస్‌ఎంఈశాఖ పనితీరుపై తిరుపతి, చిత్తూరు జిల్లా లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎఫ్‌ఎస్‌ఎంఈ అసోసియేషన్, ఛాంబర్‌ఆఫ్ కామర్స్ వారితో జరిగే సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం కడపకు బయలుదేరి వెళ్లతున్నట్లు తెలిపారు

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీవో దాడి

● మస్టర్లలో సంతకాల విషయమై వివాదం



గాయపడిన చంద్రశేఖర్

పెళ్లకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మస్టర్లలో సంతకాల విషయమై వివాదం చెలరేగడంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీవో దాడి చేసిన ఘటన మంగళవారం పెళ్లకూరు ఉపాధి కార్యాలయంలో చోటు చేసుకుంది. పునబాక పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఉపాధి పనుల మస్టర్లపై సంతకాలు చేయాలని ఏపీవో దయానందంను కోరారు. అందుకు ఆయన అంగీకరించక పోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన దయానందం తాను భోజనం తెచ్చుకున్న క్యారీ బాక్స్‌తో చంద్రశేఖర్‌పై దాడి చేశాడు. గాయపడిన చంద్రశేఖర్ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి- విశాఖ మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే వివిధ ప్రాంతాలకు మే 5 నుంచి జూలై ఒకటి వరకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్టణం- తిరుపతి మధ్య 18 సర్వీసులు నడుస్తాయి. మే 5 నుంచి ప్రతి సోమవారం విశాఖపట్టణంలో ప్రత్యేక రైలు(08583) బయలుదేరి తిరుమల ఎక్స్‌ప్రెస్ మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు తిరుపతికి చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలు(08584) మే 6 నుంచి, ప్రతి మంగళవారం తిరుపతిలో బయలుదేరి విశాఖ చేరుకొంటుంది.

సరికొత్త హంగులతో శ్రీనివాస క్రీడా సముదాయం





మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీన - సిద్ధమైన రైఫిల్ షూటింగ్ కేంద్రం

● ఆధునికీకరణ పనులు పూర్తి

● నేడు ప్రారంభించనున్న మంత్రి

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయం సరికొత్త హంగులతో ముస్తాబైంది. శిథిలావస్థకు చేరుకున్న ఈ సముదాయాన్ని కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దింది. దీనిని బుధవారం మంత్రి రాంప్రసాదరెడ్డి ప్రారంభించనున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇదే సముదాయంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. కూటమి అధికారంలోకి రావడం.. శాప్ చైర్మన్‌గా ఎ.రవినాయుడు నియమితులయ్యారు. తొలిప్రాధాన్యంగా ఆయన శ్రీనివాస క్రీడా సముదాయంపై దృష్టిపెట్టారు. మూడు నెలల్లో ఆధునికీకరణ పనులు పూర్తి చేయించారు. బుధవారం జరిగే ప్రారంభోత్సవానికి సంబంధించి మంగళవారం అధికారులతో సమీక్షించారు. కాగా, ఆధునికీకరణ పనుల్లో భాగంగా.. రూ.55లక్షలతో స్విమ్మింగ్‌పూల్‌ను అభివృద్ధి చేశారు. పాచిపట్టిన భవనాన్ని రూ. 28 లక్షలతో పునర్నిర్మించి ఎన్టీఆర్ క్రీడా వికాసకేంద్రంగా మార్చారు. అందులోనూ రూ.25 లక్షలతో రైఫిల్ షూటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అర్ధంతరంగా ఆగిన మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీన కేంద్రాన్ని రూ.1.37 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో పికిల్‌బాల్, వాలీబాల్, బాస్కెట్ బాల్ క్రీడాంశాల వేదికగా రూపొందించారు. రూ.29లక్షలతో లైట్లు మార్చారు. మరుగుదొడ్లను మరమ్మతులు చేయించారు. దాతల సహాయంతో మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఏర్పాటుచేయించారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు పోటీలు నిర్వహించేలా తీర్చిదిద్దారు.

క్రిస్ సిటీ ఇకపై ఇండస్ట్రియల్ కారిడార్

● చిల్లకూరు, కోట మండలాల్లోని 10,834 ఎకరాల్లో ఏర్పాటు ● గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): క్రిస్ సిటీ ఇకనుంచీ ఇండస్ట్రియల్ కారిడార్ హోదా సంతరించుకోనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన కృష్ణపట్నం నోడ్ (క్రిస్ సిటీ) చిల్లకూరు, కోట మండలాల పరిధిలో ఏర్పాటు కానున్న సంగతి తెలిసిందే. రూ.37,500 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా, 4,67,500 మందికి ఉద్యోగాలు కల్పించేలా ఈ నోడ్‌కు కేంద్ర ప్రభుత్వం గతంలోనే అనుమతులిచ్చింది. తొలి దశలో రూ.1518.44 కోట్లతో మౌళిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఇటీవల ప్రధాని మోదీ విశాఖ నుంచీ వర్చువల్‌గా కృష్ణపట్నం నోడ్‌కు శంకుస్థాపన చేశారు. ఆ క్రమంలో సీబీఐసీ కృష్ణపట్నం నోడ్‌ను ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ యాక్ట్ 2017 కింద ఇండస్ట్రియల్ నోడ్‌గా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. కృష్ణపట్నం నోడ్ పూర్తిగా తిరుపతి జిల్లా పరిధిలో ఏర్పాటు కానుంది. చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో 1131 ఎకరాలు, బల్లవోలులో 2009 ఎకరాలు, వెల్లపాలెంలో 1885 ఎకరాలు, మోమిడిలో 285 ఎకరాలు, తూర్పు కణుపూరులో 400 ఎకరాలు, కోట మండలం కర్లపూడిలో 1032 ఎకరాలు, కొత్తపట్నంలో 3651 ఎకరాలు, సిద్ధవరంలో 439 ఎకరాలు చొప్పున మొత్తం 10,834 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం ఈ ఇండస్ట్రియల్ నోడ్ కోసం కేటాయించింది. దీంతో ఈ రెండు మండలాల్లోని ఎనిమిది గ్రామాలకు చెందిన 10,834 ఎకరాలను ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో క్రిస్ సిటీగా పరిగణనలో ఉన్న ఈ ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఇకనుంచీ మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు మొదలు కానున్నాయి.

ప్రజా రవాణాధికారిగా వెంకటరావు



తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణాధికారిగా కె.వెంకటరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన ప్రకాశం జిల్లా డీపీటీవోగా పనిచేస్తున్నారు. ప్రస్తుతమున్న నరసింహులు ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఇదేరోజు వెంకటరావు బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఏఐతో ప్రయోజనాలెన్నో?

● సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి



సదస్సులో ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, అలా కలిగే ప్రయోజనాలపై పరిశోధనలు సాగాలని సంస్కృత యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఏఐ టెక్నాలజీపై వర్సిటీలో రెండు రోజుల జాతీయ సదస్సును మంగళ వారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మోడరన్ స్కూల్లో టెక్నాలజీ అమలు చేస్తామన్నారు. రిజిస్ట్రార్ నారాయణరావు మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీకి సంబంధించిన అంశాలు ప్రాచీన భారతీయ విజ్ఞానంలో ఉన్నాయన్నారు. సీ-డాక్ ఈడీ సుదర్శన్ మాట్లాడుతూ ఏఐతో నూతన పదాల సృష్టి జరుగుతూ ఉందన్నారు. ఏఐ ద్వారా భారతీయ జ్ఞానపరంపరను కొత్త తరానికి అందించాలన్నారు. మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ కామకోటి వర్చువల్‌గా మాట్లాడారు. ఏఐని సంస్కృతంతో మేళవించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గణపతిభట్, ప్రొఫెసర్ రమాశ్రీ, డీన్ రజనీకాంత్‌శుక్లా, తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ కృష్ణప్రపూర్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మే 6 నుంచి పద్మావతి పరిణయోత్సవాలు

తిరుమల, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు మే 6 నుంచి 8వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనంలోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను నిర్వహించనున్నారు. తొలిరోజు మలయప్పస్వామి గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, మూడోరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. మరోవైపు ఉభయ నాంచారులను ప్రత్యేక పల్లకీలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. తర్వాత కనులపండువగా కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఉత్సవం నేపథ్యంలో మూడురోజుల పాటు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవలను టీటీడీ రద్దు చేసింది.



వృద్ధులకు ఊతం .... గౌరవం

సీనియర్ సిటిజన్ కార్డుల పంపిణీ

సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ



సీనియర్ సిటిజన్ కార్డు నమూనా

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు చేతికర్రే కాదు... జేబులో వున్న ఈ-కార్డు కూడా ఊతం కానుంది. వృద్ధాప్యం గౌరవంగా కొనసాగాలని, 60 ఏళ్ళు దాటిన వారికి ప్రభుత్వం సీనియర్ సిటిజన్ కార్డులు పంపిణీ చేస్తోంది. జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ నడుస్తోంది. ఈ కార్డులు వినియోగించుకుని వృద్ధులు అనేక సేవలు పొందడానికి అవకాశముంది. మహిళలైతే 58 ఏళ్ళ వయస్సు నిండిన వారంతా సీనియర్ సిటిజన్ కార్డు పొందవచ్చు.రెండురోజుల క్రితం సీనియర్ సిటిజన్ కార్డుల పంపిణీకి సంబంధించి మార్గదర్శకాలు విడుదలయ్యాయని సచివాలయాల జిల్లా పర్యవేక్షణ అధికారి రవి కుమార్ చెప్పారు.

● పది నిమిషాల్లో పూర్తి

పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, కుల ధృవీకరణ పత్రం వంటి వివరాలతో సచివాలయానికి వెళ్ళి డిజిటల్ సహాయకుడిని సంప్రదించి రూ.40 రుసుము చెల్లించాలి. 10 నిమిషాల్లో సీనియర్ సిటిజన్ కార్డు పొందవచ్చు. ఈ-కార్డు కోసం వెళ్ళే వారు తమ వెంట ఆధార్ నెంబరుకు అనుసంధానమైన మొబైల్ ఫోన్‌ను తీసుకెళ్ళాల్సి వుంటుంది.

● బ్లడ్ గ్రూప్ సైతం

సీనియర్ సిటిజన్ కార్డు మీద సంబంధిత వ్యక్తి బ్లడ్ గ్రూప్, ఎమర్జెన్సీలో సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు కూడా పొందుపరుస్తారు. దీనివల్ల అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు ఆ వివరాలు తోడ్పడుతాయి.

● సంక్షేమం నుంచి రాయితీల వరకు

సీనియర్ సిటిజన్ కార్డు ఉంటే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలన్నీ సులభంగా పొందవచ్చు. ఇతర గుర్తింపు కార్డుల అవసరం అంతగా ఉండదు. ఆశ్రమాల్లో సేవలు పొందేందుకు కూడా ఇది ఉపయోగపడుతుంది. ఆర్టీసీ బస్సుల్లో 25శాతం రాయితీ లభిస్తుంది. రైల్లో కింది బెర్త్‌లు కేటాయిస్తారు. బ్యాంకింగ్, పోస్టాఫీసుల్లో డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ పొందడానికి ఈ కార్డు ఉపయోగపడుతుంది. కోర్టు కేసులకు తేదీల కేటాయింపు, పన్ను మినహాయింపులకు ఉపయోగపడుతుంది.పాస్‌పోర్టు పొందాలంటే అయ్యే రుసుములో 10శాతం రాయితీతో పాటు ప్రత్యేకంగా టోకెన్లు జారీచేసి పని త్వరగా పూర్తిచేస్తారు.

పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి వుంది

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



పాత్రికేయుల హెల్త్ ఇన్సూరెన్స్ సాయానికి సంబంధించి నమూనా చెక్కు ఆవిష్కరణ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు.చిత్తూరు జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(ఏపీడబ్ల్యూజేఎఫ్) జిల్లా సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సంవత్సరం మెరిట్ సాధించిన జర్నలిస్టుల పిల్లలకు తన వంతు సాయంగా రూ.2 లక్షలు ఆర్థికసాయం అందిస్తానని హామీఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాత్రికేయుల కోసం గృహ నిర్మాణం, హెల్త్‌కార్డులను సమకూరుస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పాత్రికేయులు ఖచ్చితమైన సమాచారంతో వాస్తవాలను ప్రజల ముందుంచాలని తెలిపారు.ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కోరారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ 400 మంది పాత్రికేయుల హెల్త్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి తనవంతుగా రూ.5.20 లక్షలు అందించారు.పాత్రికేయులు భయం, పక్షపాతం లేకుండా కులాలకు, పార్టీలకు అతీతంగా వార్తలు రాయాలన్నారు.పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్,ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి వేసవి సెలవులు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): 2023-24 విద్యా సంవత్సరం బుధవారంతో ముగియనుండటంతో గురువారం నుంచి విద్యార్థులకు రాష్ట్ర పాఠశాల విద్య శాఖ వేసవి సెలవులు ప్రకటించింది. జూన్ 11వ తేదీ వరకు సెలవులు కాగా, 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇదిలా ఉండగా, బుధవారం మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ టెన్త్ పబ్లిక్ ఫలితాలు వెల్లడించనున్నారు. మరో వైపు ఇంటర్మీడియట్‌లో జూనియర్ కళాశాలలకు సైతం గురువారం నుంచి సెలవులు ప్రకటించగా, జూన్ ఒకటి నుంచి కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఇంటర్ ఫలితాలు వెలువడగా, టెన్త్ ఫలితాలు సైతం రానున్న క్రమంలో ఫెయిలైన విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల వారీగా పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి, సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయనున్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవా శిబిరానికి 30 ఫిర్యాదులు


వినతులు స్వీకరిస్తున్న బీఎస్ఎన్ఎల్ అధికారులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ సేవా శిబిరానికి విశేష స్పందన వచ్చిందని డీఈ సురేంద్రనాథ్ తెలిపారు.మంగళవారం చిత్తూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సేవా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో నెట్‌వర్క్ సమస్యలపై 17, ఇంటర్‌నెట్ సేవలపై 5, బిల్లుల సంబంధిత సమస్యలపై 6, ల్యాండ్‌లైన్ సమస్యలకు సంబంధించి రెండు ఫిర్యాదులు అందాయన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

74 మందికి హజ్ యాత్రికులకు ఉచిత వ్యాక్సినేషన్


వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రికులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో సుధారాణి మంగళవారం ప్రారంభించారు. స్థానిక టెలిఫోన్ కాలనీలోని అర్బన్ పీహెచ్‌సీలో జరిగిన ఈ కార్యక్రమంలో 74 మంది ముస్లింలు వ్యాక్సిన్లు వేయించుకున్నారని, వారందరికీ వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ అందజేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్‌కుమార్, స్టేట్ అబ్జర్వర్ నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ వైస్ ఎంపీపీ మృతి


పత్తిపాటి ధనంజయ నాయుడు(ఫైల్ ఫొటో)

ఐరాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఐరాల మండల మాజీ వైస్ ఎంపీపీ పత్తిపాటి ధనంజయ నాయుడు(55) మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు... ధనంజయ నాయుడు పాటూరుసంతగేటులో తన సొంత పని చూసుకుని ఇంటికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. పొలకల బస్ షెల్టర్ వద్ద మొరుం లోడుతో వస్తున్న ట్రాక్టర్ తగిలి ఆయన ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. దీంతో ట్రాక్టర్ వెనుక చక్రం ఆయన తలపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. స్థానికుల సమాచారం మేరకు ఐరాల పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. ఐరాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడులు ధనంజయ నాయుడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

స్లాట్ బుకింగ్ విధానంతో దళారీ రహిత పారదర్శక సేవలు

● జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి


స్లాట్ బుకింగ్‌ల గురించి సబ్ రిజిస్ట్రార్లకు వివరిస్తున్న రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): స్లాట్ బుకింగ్ వల్ల సమయం ఆదాతో పాటు కార్యాలయాల చుట్టూ తిరిగే కష్టాలు తగ్గుతాయని,ఆ కారణంగా దళారుల్లేని పారదర్శక సేవలు ప్రజలకు అందిద్దామని జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి చెప్పారు.చిత్తూరు ఆర్వో (సబ్‌రిజిస్ట్రార్) కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని ఎస్ఆర్‌లకు, సీనియర్ అసిస్టెంట్లకు స్లాట్ బుకింగ్ విధానంపై ఒకరోజు వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానం ఈనెల 4వతేది నుంచి పైలట్ ప్రాజెక్టు కింద చిత్తూరుఆర్వోలో అమలుచేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈనెల 30వ తేదినుంచి అమలుచేస్తామన్నారు. తరచూ ఏర్పడుతున్న సర్వర్ సమస్య కారణంగా స్లాట్ బుకింగ్ విధానంలో తీవ్ర ఇబ్బందులు ఎదురౌతాయని పలువురు సబ్‌రిజిస్ట్రార్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.ఈ అంశాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి సర్వర్ సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని జిల్లా రిజిస్ట్రార్ హామీయిచ్చారు. స్లాట్ బుకింగ్‌ను అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా కూడా చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు తమ వివరాలు నమోదు చేశాక డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా రిజిస్ట్రేషన్ కోసం టోకెన్ తీసుకోవాలని, తర్వాత డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు అవసరమైన సేవలు ఎంపిక చేసుకోవాలన్నారు. స్లాట్ బుకింగ్‌కు ముందురోజే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడంతో పాటు ఫీజు కూడా ముందస్తుగా చెల్లించవచ్చన్నారు. ఒకవేళ డీక్యూఎంఎస్ రద్దు చేసుకోవాలనుకుంటే రూ.100,మార్పు చేసుకోవాలనుకుంటే రూ.200 చెల్లించాలని చెప్పారు. స్లాట్ బుకింగ్ విధానం వల్ల కక్షిదారులకు సమయం ఆదా అవుతుందన్నారు. తొలుత స్లాట్ బుకింగ్ విధానం అమలులో బాలారిష్టాలు రావడం సహజమేనని, కొద్దిరోజులకు అవి సర్దుకుంటాయన్నారు.ఎస్ఆర్‌లు లేవనెత్తిన సందేహాలను చిత్తూరు ఆర్వో(ఎస్ఆర్) హేమంత్‌రాజు నివృత్తిచేశారు.





ఓటివారిపల్లె సర్పంచి భగవతికి ప్రశంసాపత్రం అందజేస్తున్న పీఆర్ కమిషనర్ కృష్ణతేజ - శాసనసభను సందర్శించిన మహిళా సర్పంచులు

చల్లపల్లిలో మహిళా సర్పంచుల పర్యటన

యాదమరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహిళా సర్పంచులకు గ్రామ పంచాయతీ అభివృద్ధితో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో సోమ, మంగళవారం నిర్వహించిన రెండ్రోజుల పర్యటనకు జిల్లా నుంచి 25 మంది మహిళా సర్పంచులను తీసుకెళ్లారు. కృష్ణాజిల్లా శ్రీకాకుళం మండలంలోని ఆదర్శ గ్రామ పంచాయతీ చల్లపల్లిలో పర్యటించి అక్కడ జరిగిన అభివృద్ధి పనులను వీరు పరిశీలించారు. గ్రామ పంచాయతీలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, కొండలు, గుట్టలు, చెరువుల వద్ద పచ్చదనాన్ని పెంపొందించడం తదితర అంశాలపై సర్పంచులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యాదమరి మండలం ఓటివారిపల్లె సర్పంచి పత్తిపాటి భగవతి, సిద్ధారెడ్డిపల్లి సర్పంచి గిరిజ, కాశిరాల సర్పంచి రాధ, మోర్దానపల్లి సర్పంచి మీనా మనోజ్‌కుమార్, ఇతర సర్పంచులకు మంగళవారం అమరావతిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో ఆ శాఖ కమిషనర్ వి.ఆర్.కృష్ణతేజ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం వారితో కలిసి శాసనసభను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఈఎస్ సంస్థ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ రాణి రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి శ్యామల పాల్గొన్నారు.

పెరుగుతున్న ఎండలతో సతమతం



చిత్తూర్ కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ పెరుగుతున్న ఎండల ధాటికి ప్రజలు అల్లాడిపోతున్నారు. గాలిలో తేమశాతం తగ్గి ఉక్కపోత పెరగడంతో వృద్ధులు చిన్నారుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మంగళవారం అత్యధికంగా తవణంపల్లి మండలంలో 39.5, అత్యల్పంగా పుంగనూరులో 34 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదయింది. మండలాలవారీగా నగరిలో 39.3, బంగారుపాళ్యం, సదుం మండలాల్లో 38.6, చిత్తూరు, గుడిపాల మండలాల్లో 38.5, ఎస్ఆర్ పురంలో 38.3, సోమలలో 38.2, గంగాధరనెల్లూరు, పులిచెర్ల, పూతలపట్టు, వెదురు కుప్పం మండలాల్లో 37.6, రొంపిచర్లలో 37.2, గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో 37.1, చౌడేపల్లె, నింద్ర, పాలసముద్రం, పెనుమూరు, ఐరాల, విజయపురం మండలాల్లో 36.9, యాదమరిలో 36.7, కార్వేటినగరంలో 36.2, గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో 35.7, కుప్పంలో 35.6, పలమనేరులో 35.2, రామకుప్పంలో 34.5, వి.కోటలో 34.3, బైరెడ్డిపల్లెలో 34.1 పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

తిరుపతిలో స్వామి హాంఫట్

● పూజలు, మంత్రాలు, తిరుమలలో దుకాణాలు ఇప్పిస్తానని మోసం
● రూ.10 కోట్లతో పలాయనం ● లబోదిబోమంటున్న బాధితులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పూజలు, మంత్రాల పేరు చెప్పాడు. తిరుమలలో దుకాణాలు ఇప్పిస్తానన్నాడు. ఇలా పలువురిని మోసం చేసిన ఓ స్వామి.. రూ.10 కోట్లతో పలాయనం సాగించిన ఉదంతం ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన ప్రకారం.. చెన్నైకి చెందిన స్వామి కొన్నేళ్ళ కిందట కుటుంబంతో పాటు తిరుపతికి వలసొచ్చాడు. 2021లో తిరుమలకు మకాం మార్చాడు. అక్కడ ఒక ఇల్లు అద్దెకు తీసుకుని పూజలు, మంత్రాలు పేరుతో భారీ ఎత్తున డబ్బులు వసూలు చేశాడు. ఈ క్రమంలో అక్కడి ఇంటి యజమానితో గొడవ పడి తిరుపతికి వచ్చాడు. శివజ్యోతినగర్‌లో కాపురం పెట్టాడు. ఇతడికి ఇద్దరు పిల్లలు. గత రెండున్నర సంవత్సరాలుగా తిరుపతిలో ఉన్నాడు. తెలిసిన వారికి జాతకాలు చెప్పడం, మంత్రాలు, తంత్రాలు చేయడం, వివిధ రకాల పూజలు చేస్తూ ప్రజలను నమ్మించాడు. తనకు జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు బాగా తెలుసని, ఏవైనా పనులు కావాలంటే చేసి పెడతానని పలువురికి చెప్పాడు. తిరుమలలో దుకాణాలు తీసిస్తానన్నాడు. ఇతడిని నమ్మిన కొందరు తమ పనుల నిమిత్తం రూ.15 లక్షల నుంచి రూ.90 లక్షల వరకు స్వామికి ఇచ్చారు. తిరుమలలో దుకాణం ఇప్పిస్తానని చెప్పి, అక్కడి బాలాజీనగర్‌లోని ఇద్దరు అన్నదమ్ముల వద్ద దాదాపు రూ.1.30 కోట్లు తీసుకున్నట్లు వీరిలో ఒకరు చెప్పారు. ఇలా దాదాపు 10 నుంచి 15 మంది బాధితులు ఉన్నారు. వారం రోజులుగా అతడు కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు శివజ్యోతినగర్‌లోని ఇంటికి వెళ్లి చూడగా తాళాలు వేసి ఉంది. చుట్టుపక్కల వారిని విచారించగా ఈ నెల 16న ఊరికి వెళుతున్నానని చెప్పి వెళ్ళారని చెప్పారు. దీంతో వారం రోజులుగా వేచి చూసిన బాధితులు చివరకు అలిపిరి పోలీసులను మంగళవారం ఆశ్రయించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


కరపత్రాలు పంచుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

నగరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం చేశారు. మంగళవారం మండలంలోని ఎం.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో గల వసతులను తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. నాణ్యమైన విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాంను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందని పిల్లల తల్లిదండ్రులకు వివరించారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌ను జీర్ణించుకోలేని వైసీపీ నేతలు

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్



చిత్తూరు సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలను మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 16,347 టీచర్ ఉద్యోగాలకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించకుండా మెగా, జంబో, మినీ డీఎస్సీ అని కాలం గడిపేసిన మోసకారి ప్రభుత్వం జగన్ రెడ్డిదని చెప్పారు. నీతి అయోగ్ నివేదిక ప్రకారం నాణ్యమైన విద్యలో రాష్ట్రాన్ని 3వ స్థానం నుంచి 19వ స్థానానికి దిగజార్చారని విమర్శించారు. పీఆర్సీ సాధన కోసం విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డు ముట్టడికి ప్రయత్నించిన ఉపాధ్యాయులపై దారుణంగా లాఠీచార్జీ చేయించారని అన్నారు. ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించారా అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకు దూసుకుపోతోందని ఆయన చెప్పారు.

కోసలనగరంలో పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించడమే ధ్యేయం

● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్


చెన్నై అంబత్తూరులో పారిశ్రామిక వేత్తలతో ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలోని విజయపురం మండలం కోసలనగరంలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. ఆయన మంగళవారం ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి చెన్నై అంబత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసలనగరంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి, పరిశ్రమల స్థాపనకు ఏపీఐఐసీ సేకరించిన భూముల వివరాలను, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను వారికి వివరించారు. పరిశ్రమ ప్రతినిధులు కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. మాజీ మంత్రి స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమనాయుడు కూడా పరిశ్రమల స్థాపనకు కృషి చేశారని, ఆయన బాటలో తనయుడు ప్రయత్నాలు సాగించడం హర్షణీయమని మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్, బస్సు ఢీ

45 మందికి గాయాలు

రేణిగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మర్రిగుంట మలుపు వద్ద మంగళవారం ఉదయం 7.30 గంటలకు జరిగిన ప్రమాదంలో 45 మంది గాయపడ్డారు. యోగానంద ఉమెన్స్ హాస్టల్ నుంచి విమానాశ్రయం సమీపంలోని ఫాక్స్ లింక్ పరిశ్రమలో పనిచేయడానికి మహిళా ఉద్యోగులు కంపెనీ బస్సులో బయలుదేరారు. అదే సమయంలో రేణిగుంట నుంచి పాపానాయుడుపేటకు వెళ్తున్న ట్రాక్టర్ మర్రిగుంట మలుపు వద్దకు వచ్చింది. వేగాన్ని నియంత్రించే క్రమంలో బ్రేకులు వేసినా.. బస్సు, ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సు బోల్తా పడింది. అందులో ఉన్న 45 మంది మహిళ ఉద్యోగులు గాయపడ్డారు. డీఎస్పీ శ్రీనివాసరావు సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన 35 మందికి ప్రథమ చికిత్సలందించారు. ఆరుగురు తీవ్రంగా గాయపడగా ఇందులో నలుగురు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేడీసీ విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కుప్పం డిగ్రీ కళాశాలలో బెంగళూరుకు చెందిన ఆల్‌డీజీ టెక్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. గ్రూప్ డిస్కషన్, వ్యక్తిత్వ పరీక్ష, హెచ్‌ఆర్ రౌండ్ అనే మూడు విడతల్లో జరిగిన వడపోత తర్వాత 9 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.సుధారాణి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.పార్తీబన్, సంస్థ ప్రతినిధి బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. విద్యార్థులను కళాశాల చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, వైస్ చైర్మన్ సాగర్ రాజ్, అధ్యాపకులు అభినందించారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం


కార్మికులకు చీరలు పంపిణీ చేసిన ఎంపీడీవో, ఎంఈవోలు

కల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలు అమోఘమని ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్, ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య, ఎంఏవో హరిప్రసాద్ తెలిపారు. పులిచెర్ల ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం కల్లూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. సమాజసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నిర్వాహకులు వెంకటశిద్దులు, రాజేంద్ర, రాజన్, చాంద్ బాషా పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎన్‌జీసీ నిర్వాహకులు

కల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కలను పెంచాలని నేషనల్ గ్రీన్ కోర్ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, గ్రీన్ మాస్టర్ వెంకటశిద్దులు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం శ్రీవాణి ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, వేణుగోపాల్, పద్మవేణి, సైదుల్లా, ఈశ్వరయ్య, రాజశేఖర్, విమల, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


బాలికను పాఠశాలలో చేర్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు మునాఫ్

పలమనేరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పలమనేరు కాకాతోపు ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునాఫ్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాకాతోపు ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొంటున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను, పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులను, మధ్యాహ్న భోజనం వంటి పథకాలను వివరించారు. కొంతమంది అప్పటి కప్పుడే తమ పిల్లలను పాఠశాలలో చేర్పించారు.

రూ.2.12 కోట్లతో కేజీబీవీలో తరగతి గదుల నిర్మాణాలు


పాఠశాలలో పనుల కోసం సర్వే చేస్తున్న అధికారులు

రొంపిచెర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులకు అవసరమైన వసతి గృహాలకు సమగ్ర సర్వశిక్షా అభియాన్ కింద ఆరు గదుల నిర్మాణానికి రూ.2.12 కోట్లు నిధులు మంజూరైనట్లు ఎస్ఎస్ఏ ఈఈ మధుసూదన్‌రావు, ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విద్యాలయంలో రూ.60 లక్షలతో నిర్మిస్తున్న సైన్సు ల్యాబ్, కంప్యూటర్ గదుల పనులను పరిశీలించారు. అలాగే రొంపిచెర్ల బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.15.58 లక్షలతో జరుగుతున్న కెమిస్ట్రీ ల్యాబ్ పనులు, ఎస్ఎస్ఏ కింద జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. నాణ్యతగా సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు రఫీ, గౌస్‌పీర్‌ఖాన్‌లకు సూచించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

28 నుంచి వేసవి శిక్షణ శిబిరం

కుప్పం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కుప్పం శాఖా గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి సత్యవాణి తెలిపారు. ఆసక్తి కలిగిన పిల్లలు తమ పేర్లను గ్రంథాలయాధికారికి ఇవ్వాలని ఆమె కోరారు.

● పలమనేరు: పలమనేరు శాఖా గ్రంథాలయంలో ఏప్రిల్ 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు శాఖా గ్రంథాలయాధికారి హేమకుమార్ తెలిపారు. ఉచిత శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు కథలు, చిత్రలేఖనం, స్పోకన్ ఇంగ్లీషు, చెస్, క్యారమ్స్, క్విజ్ తదితర అంశాలపై నైపుణ్యం కలిగిన వ్యక్తులతో శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని వేసవిలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకంతో నష్టాలు అధికం


ప్లాస్టిక్ వ్యర్థాలతో నష్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకంతో నష్టాలు అధికంగా ఉంటాయని.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని పాఠశాల హెచ్‌ఎం మహేశ్‌నారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక పాఠశాల ఆవరణలో ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద పరిశుభ్రత పాటించకపోవడంతో అంటురోగాలు వ్యాప్తి చెందుతాయని.. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలని సూచించారు. కళాకారులు దుర్గాప్రసాద్, విశ్వనాథ్‌లు వినోదభరితంగా విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో విద్యార్థులు రాణించాలి


సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు

గంగవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): హైస్కూల్ విద్యకు వెళ్తున్న విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని.. పత్తికొండ హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక పత్తికొండ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సరస్వతీ దేవిని పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి సరస్వతీ పూజ చేశారు. అనంతరం పాఠశాలకు రూ.35 వేలు విలువైన వైర్‌లెస్ మైక్‌సెట్‌లను దాతలు హరీష్‌కుమార్, సౌజన్య కుమార్, బద్రిలు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసన్నకుమార్, గిరిజ, రామ్‌మోహన్, ఎస్ఎంసీ చైర్మన్ మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విధిగా ఈకేవైసీ చేయించుకోవాలి

రొంపిచెర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) రేషన్‌కార్డు ఈకేవైసీ ఈనెలాఖరు గడువు విధించినట్లు తహశీల్దారు కిరణ్‌కుమార్ తెలిపారు. విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని.. లేకుంటే రేషన్ పంపిణీ నిలుపుదల జరుగుతుందని పేర్కొన్నారు. రేషన్ కార్డు కలిగిన వారందరూ ఈనెల 30 లోపు డీలరు వద్ద ఈకేవైసీ చేసుకోవాలని కోరారు.

ఘనంగా పురందేశ్వరి జన్మదిన వేడుకలు


యాచకులకు అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి జన్మదిన వేడుకలను పుంగనూరులో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక సుగుటూరు గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పట్టణంలోని యాచకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఆమె మరిన్ని పదవులు పొందాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌రాజు, మల్లికా రాణి, మణిమొదలియార్, జగన్నాథం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి మంగళవారం ఫిర్యాదుల దినం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో ప్రతి మంగళవారం గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజా సమస్యలపై వినతులు స్వీకరిస్తున్నట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామాల్లో సమస్యలుంటే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐలు లోకేశ్, వెంకటరమణ పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కష్టపడిన వారికే ప్రాధాన్యం


శాంతిపురం: సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ మునిరత్నం


రామకుప్పంలో మాట్లాడుతున్న నాయకులు

శాంతిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కష్టకాలంలో పార్టీ అభివృద్ధి కష్టపడి పనిచేసిన వారికే సంస్థాగత ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించాలని కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి , ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. మంగళవారం రాళ్లబూదుగూరు, కోనేరుకుప్పం, చెంగుబల్ల, 121 పెద్దూరు గ్రామ పంచాయతీ టీడీపీ సంస్థాగత ఎన్నికలు శాంతిపురం మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో జరిగాయి. ఎన్నికల పరిశీలకులుగా కుప్పం మండల మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, టీడీపీ సీనియర్ నేత కన్నన్ వ్యవహరించారు. సమావేశాలలో పీఎస్ మునిరత్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే ధ్యేయంగా పలు కార్యక్రమాల అమలకు శ్రీకారం చుట్టారన్నారు. రాళ్లబూదుగూరు కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి రూ.7.88 కోట్లు మంజూరు చేశారన్నారు. రెండు రోజుల్లో టెండర్లు పూర్తి కాగానే త్వరలోనే పనులు ప్రారంభిస్తారన్నారు. రాళ్లబూదుగూరు పంచాయతీ పార్టీ అధ్యక్షులుగా జయరాజ్, ప్రధాన కార్యదర్శి సుల్తాన్‌బాషా, యూనిట్ ఇన్‌చార్జిగా ఆర్ఎస్ మణి, కోనేరుకుప్పం పార్టీ అధ్యక్షుడిగా అర్జునప్ప, ప్రధాన కార్యదర్శిగా ఇలియాజ్‌బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చెంగుబల్ల, 121పెద్దూరు పంచాయతీలకు పోటీ తీవ్రం కావడంతో వాయిదా వేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు, మాజీ ఎంపీపీలు చంద్రశేఖర్, ఉదయకుమార్‌నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, నేతలు ఏఎంసీ నాగరాజు, రుద్రప్ప, బసవరాజు, నారాయణరెడ్డి, చలపతి, హరినాథరెడ్డి, కుమార్, రమేష్, నారాయణస్వామి, చంగారెడ్డి, నారాయణ, క్యాబేజి మురళీ, మురుగేష్, లోకేష్, గోపాల్, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు శ్యామల, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

పదవులు అలంకారప్రాయం కాదు

రామకుప్పం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నేతలకు పదవులు కేవలం అలంకారప్రాయంగా మారకూడదని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి అన్నారు. మంగళవారం రామకుప్పంలో జరిగిన రామకుప్పం, మణీంద్రం పంచాయతీల కమిటీ ఎన్నికల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీల్లో స్థానం దక్కించుకున్న నేతలు పార్టీకి, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలన్నారు. గ్రామాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ది చేకూరేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, నేతలు నరసింహులు, రామ్మూర్తి, శ్రీనివాసులురెడ్డి, గంట్లప్పగౌడు, మహ్మద్‌రఫీ, విశ్వనాథ్, వెంకటాచలం, నందారెడ్డి, జయశంకర్, గజేంద్ర, గుర్రప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, సత్తి, రామలింగారెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, గంట్లరెడ్డి, సలాంసాబ్, రామకృష్ణప్ప, ఆదిల్, విజయ్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, సుబ్రీ, మంజునాథ్, సతీష్, అమర్, పద్మనాభరెడ్డి, ఆంజి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

● పలమనేరు: మండలంలోని మూడు పంచాయతీల్లో టీడీపీ కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. బయప్పగారిపల్లి పంచాయితీ అధ్యక్షులుగా మూర్తి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా చక్రపాణి, కరిడిమడుగు పంచాయితీ అధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా గణపతి, సముద్రపల్లి పంచాయతీ అధ్యక్షులుగా చలపతి, ప్రధాన కార్యదర్శిగా నరేష్‌లను ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు నాగరాజరెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్, సీనియర్ నాయకులు జగదీష్‌నాయుడు, మల్లీశ్వరరెడ్డి, జయప్రకాష్, పెద్దబ్బ, అమరనాథరెడ్డి, రామ్మూర్తినాయుడు, వెంకటమునిరెడ్డి, బాలాజీనాయుడు, హరిబాబు, సెల్వరాజు, గిరిబాబు, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కల్లూరు : పోస్టర్లు ప్రదర్శిస్తున్న సీడీపీవో, ఎంపీడీవో


కుప్పం: మహిళలకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ

కుప్పం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో చంద్రకళ అన్నారు. కుప్పంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కొట్టాలూరు పంచాయతీ, కుప్పం పురపాలక సంఘం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం 'పోషణ్ పక్వాడా' కార్యక్రమం నిర్వహించారు. ఆహారంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత, మహిళ గర్భం దాల్చినప్పటినుంచీ బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వయసు వరకు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలు, చిన్నారుల్లో పోషకాహార లోపం నివారణ, చిన్నారుల్లో ఊబకాయం తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణవేణి, దిల్షాద్ బేగం, అనసూయ, జయంతి, లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

● కల్లూరు: పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మల్లీశ్వరి మాట్లాడుతూ పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్ బాబు, వైద్యాధికారిణి షమామ, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమాదేవి, శిరీష, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పలమనేరు: గర్భిణులు, బాలింతలు మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి పేర్కొన్నారు. మంగళవారం పలమనేరు మండలం కొలమాసనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు.

రోగుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలి


ఆసుపత్రిలో వైద్య సేవలు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ పద్మాంజలి దేవి

సదుం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలో రోగులపై వైద్య సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని డీసీహెచ్ఎస్ పద్మాంజలి దేవి సూచించారు. మంగళవారం సదుం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది రికార్డుల నిర్వహణ, హాజరు పట్టికలను పరిశీలించారు. రోజువారీ ఔట్ పేషెంట్ సంఖ్య పెరిగేలా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి పుష్పకుమారి, వైద్యులు ప్రసాదరాజు, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ నివాస స్థల ధ్రువపత్రాలు


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు శివయ్య

శాంతిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నివాస స్థల ధ్రువపత్రాలపై బుధవారం నుంచి పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలతో పాటు సచివాలయ సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టాలని.. అర్హులందరికీ నివాస స్థల ధ్రువపత్రాలు అందించనున్నట్లు తహశీల్దారు శివయ్య, ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల సచివాలయంలోని సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. పీఎం ఏవై 2.0 స్కీమ్‌తో 2,243 మందికి పక్కా గృహాలు అవసరమని గత 15 రోజుల క్రితం చేపట్టిన సర్వేలో వెల్లడైందన్నారు. ఇందులో 1998 మంది లబ్ధిదారులకు సొంత స్థలాలు ఉన్నందున వారికి ఇంటి నివాస స్థల ధ్రువపత్రాలు మంజూరు చేయాలన్నారు. బుధవారం నుంచి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ డిజిటల్ సహాయకులు, సర్వేయర్లు, ఇంజనీరింగ్ సహాయకులు కలిసి దరఖాస్తులు స్వీకరించి అర్హత కలిగిన వారిని గుర్తించాలన్నారు. సర్వే అధికారులకు ప్రజలు సహకరించాని తెలిపారు. పలు అసంపూర్తి భవనాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎస్ఐ నరేష్ తెలిపారు.

1 నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు

గంగవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల ఒకటో తేదీ నుంచి స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్ష కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల సందర్భంగా ఆసక్తి గల విద్యార్థులకు తెలుగుభాషా పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి రోజుకో పద్యం చొప్పున నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. 2 నుంచి ఏడో తరగతిలోపు ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను 9553429770 నంబరును సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

ఓగు పీహెచ్‌సీలో చోరీ యత్నం

వి.కోట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం ఓగు పీహెచ్‌సీలో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఆపేసిన అనంతరం ఆసుపత్రిలో కిటికీ అద్దాలు ధ్వంసం చేసి ప్రధాన ద్వారంలోనికి ప్రవేశించారు. అయితే లోపలి తలుపులు తీసేందుకు యత్నించినా రాకపోవడంతో అందుబాటులోని కొన్ని మందు సీసాలను కిందపడేసి నిరాశగా వెనుదిరిగినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఐ సోమశేఖర్‌రెడ్డికి వైద్యాధికారిని మాధవి ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలోని సీసీ కెమెరాలు పరిశీలిస్తే దుండగుల జాడ తెలియనుంది. పోలీసులు ఆ దిశగా విచారణ చేపడుతున్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర ప్రారంభం


అలంకరణలో నడివీధి గంగమ్మ

చౌడేపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్రెడ్డిపల్లెలో నడివీధి గంగమ్మ జాతర అమ్మవారి కల్యాణంతో మంగళవారం ప్రారంభమైంది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలు, చెక్కభజనలు, కోలాటాల నడుమ పురవీధులలో ఊరేగించి నడివీధిలో అమ్మవారిని ప్రతిష్ఠించారు.

నేటి నుంచి స్వయంభేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు



సోమల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కొలువుదీరిన స్వయంభేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23 నుంచి మే ఒకటో తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బీవీ సోమశేఖర్ తెలిపారు. 23న దేవాంగ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా ఉత్సవాలకు అంకుర్పాణ, ధ్వజారోహణం జరుగుతుంది. 24న చిన్నయ్యగారివీధికి చెందిన ఉభయదారుల ఆధ్వర్యంలో ఆలయంలో పూజలు, అభిషేకాలు, రాత్రి శివపార్వతుల పల్లకి సేవలు, అలాగే ఆలయంలో నూతనంగా నిర్మించిన దక్షణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపణ కార్యక్రమం గుంతచెరువుపల్లె శంకరయ్య కుటుంబ సభ్యులచే శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. 25న ఉదయం సాయిబాబా వీధికి చెందిన ఉభయదారులచే స్వామికి పుష్పపల్లకి సేవలు, 26న అభిషేక పూజలు, రాత్రి శెట్టివారివీధి ఉభయదారులచే పల్లకి సేవలు, 27న ధర్మకర్తలు బాలవీరన్న కుటుంబ సభ్యులచే శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి ఉత్సవమూర్తుల పల్లకి సేవలు, 28న సోమల దిగువవీధి ఉభయదారుల ఆధ్వర్యంలో ఉదయం అభిషేక పూజలు, రాత్రి ఉత్సవమూర్తుల ఊరేగింపు, 29న శివపార్వతుల రథోత్సవం, 30న బుధవారం అడుసుపల్లె, బుంగావారిపల్లె గ్రామాల ఉభయదారులచే పల్లకీసేవలు, మే ఒకటో తేదీన ఉట్లోత్సవం, ధ్వజా అవరోణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు.

టీడీపీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి


చింతమాకులపల్లెలో ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ

వి.కోట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో తెలుగుదేశం పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోడిగుట్టపల్లె, యాలకల్లు, చింతమాకులపల్లె, బోయచిన్నాగనపల్లె, బండపల్లె, ఓగు, బైరుపల్లె, పాముగానిపల్లె, పెద్దబరిణేపల్లె పంచాయతీలో టీడీపీ పంచాయతీ స్థాయి కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. బోడిగుట్టపల్లె అధ్యక్షులుగా ప్రకాష్ గౌడు, ప్రధాన కార్యదర్శిగా సుబ్రమణ్యంగౌడు, యూత్ అధ్యక్షులుగా సుధాకర్, యాలకల్లు అధ్యక్షులుగా బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా చంద్రశేఖర్, యూత్ అధ్యక్షులుగా విజయకుమార్, చింతమాకులపల్లె అధ్యక్షులుగా శివశంకర్, కార్యదర్శిగా గంగాధరం, యూత్ అధ్యక్షులుగా శ్రీనివాసులు, ఓగు అధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా లక్ష్మీపతి, యూత్ అధ్యక్షులుగా గంగాధర్, ఎస్.బండపల్లె అధ్యక్షులుగా శంకరప్పగౌడు, కార్యదర్శిగా రాధా, యూత్ అధ్యక్షులుగా విజయ్, బైరుపల్లె అధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా రాజేంద్ర, యూత్ అధ్యక్షులుగా కార్తీక్, పాముగానిపల్లె అధ్యక్షులుగా రూప్‌కుమార్, కార్యదర్శిగా కుమార్‌వేలు, పెద్దబరిణేపల్లె అధ్యక్షులుగా సుబ్బారెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసులులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నేతలు రాంబాబు, చౌడప్ప, ధీరజ్, శబరీష్, జనార్దన్‌రెడ్డి, గౌస్‌పీర్, రాము, సుబ్రహ్మణ్యంశెట్టి, విశ్వనాథరెడ్డి, హరినాథరెడ్డి, సతీష్‌నాయుడు, రామ్మూర్తి, చిట్టిబాబు, నాసీర్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం



రోడ్డు విస్తరణ మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా అభివృద్ధికి నోచుకోని చిత్తూరు ప్రకాశం హైరోడ్డు పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. మంగళవారం రోడ్డు విస్తరణ పనులను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరిశీలించారు. పనుల గురించి కమిషనర్ నరసింహప్రసాద్, ఏసీపీ నాగేంద్రలు వారికి వివరించారు. గిరింపేట దుర్గమ్మగుడి నుంచి కొత్త కలెక్టరేట్ వరకు వంద అడుగుల రోడ్డు విస్తరణ పనులను రోడ్డు మ్యాప్‌ద్వారా పరిశీలించారు. విస్తరణ పనులను వేగవంతం చేయాలని వారు నగరపాలక అధికారులను ఆదేశించారు.

ఒక్కరోజు నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందిస్తున్న దాత చంద్రారెడ్డి

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న ఒక్కరోజు అన్నదానం కార్యక్రమానికి హైదరాబాదుకు చెందిన శ్రావణిఆల్కోట్రీవ్ ప్రైవేట్ లిమిటెడ్ చంద్రారెడ్డి రూ.1,01,322 మంగళవారం విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మనమిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కాళేపల్లెలో కరపత్రాలు పంచుతున్న ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి కోరారు. మంగళవారం గంగాధరనెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీలోని కాళేపల్లెలో సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి ఎంపీడీవో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మనమిత్ర సేవల గురించి, ప్రభుత్వపరంగా అందుతున్న సేవలను తెలుసుకోవడానికి ప్రజల ఫోన్లకు మెసేజ్‌లు వస్తుంటాయని చెప్పారు. మనమిత్ర వాట్సప్ నెంబర్ 9552300009ను ప్రజలు తమ సెల్‌ఫోన్లలో సేవ్‌చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీడీ నెల్లూరు మొదటి ఎంపీపీ కన్నుమూత



కె.జి.రాజారెడ్డి (ఫైల్ ఫొటో)

గంగాధర నెల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):గంగాధరనెల్లూరు మండలం కోటాగరం పంచాయతీ ఎట్టేరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ కామసాని గుండ్రెడ్డి రాజారెడ్డి అలియాస్ కె.జి. రాజారెడ్డి(80) అనారోగ్యంతో మంగళవారం ఉదయం కన్నుమూశారు. మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మకు ప్రధాన అనుచరుల్లో ఒకరైన రాజారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున గంగాధరనెల్లూరు మొదటి మండలాధ్యక్షుడిగా పనిచేశారు. కుతూహలమ్మ కుమారుడు ఆనగంటి హరికృష్ణ, వైసీపీ నాయకులు రాజేష్, విజయానందరెడ్డి, వేల్కూరు బాబురెడ్డి, గుణశేఖర్‌మొదలి, ఏకాంబరం, వెంకటరెడ్డి మంగళవారం రాజారెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

● జీజేఎం ట్రస్టుచే ఆర్థికసాయం





ధనంజయ కుటుంబానికి ఆర్థిక సాయం అందచేస్తున్న చెన్నకేశవులు నాయుడు, (ఇన్‌సెట్‌లో) చాణక్య వర్మ(ఫైల్ ఫొటో)

గుడిపాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిపాల క్రాస్‌లో ఈ నెల 19వ తేది రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. వీరిలో రామభద్రాపురానికి చెందిన ధనంజయ కుమారుడు చాణక్యవర్మ తీవ్రంగా గాయపడటంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఇంజనీరింగ్ చదువుతున్న చాణక్య వర్మ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు అతడి కుటుంబానికి మంగళవారం ఆర్థికసాయం అందించారు. తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల హేమాద్రి నాయుడు, సర్పంచ్ రవి నాయుడు, రాజా నివాళులు అర్పించారు.

భూసార పరీక్షలపై రైతులకు శిక్షణ



పుత్తూరులో భూసార పరీక్షల కోసం మట్టిని సేకరిస్తున్న సిబ్బంది

తవణంపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.పుత్తూరులో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం భూసార పరీక్షలు, ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ నాగపద్మిని మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడకంతో మంచి దిగుబడితో పాటు నాణ్యమైన పంట సాధ్యమన్నారు. అనంతరం భూసార పరీక్ష నిమిత్తం మట్టిని సేకరించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వేరుశనగ సాగు చేసే రైతులకు దుక్కులు లోతుగా దున్నడం వలన కలిగే ఉపయోగాల గురించి వివరించారు. ఏవో ప్రవీణ్ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకే ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న యూనివర్స్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీ స్థాపించడంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఓ వ్యక్తి వినూత్నంగా ప్రచారం చేశారు. 'నా పేరు యూనివర్స్.. రాజకీయ పార్టీ పెడుతున్నా.. మద్దతివ్వండి.. మీకు సేవ చేసే అవకాశాన్ని కల్పించండి' అని బ్యానర్ పట్టుకుని ఆ వ్యక్తి మంగళవారం చిత్తూరు గాంధీ విగ్రహం కూడలిలో ప్రచారం చేశారు. కోనసీమకు చెందిన తాను త్వరలో రాజకీయ పార్టీ పెట్టబోతున్న నేపథ్యంలో మొదట ప్రజలకు అవగాహన కల్పించడానికే ఈ యాత్ర చేపడుతున్నానని చెప్పారు. శ్రీకాకుళం నుంచి ప్రారంభమై కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముగించుకుని ప్రస్తుతం రాయలసీమ జిల్లాల్లో పర్యటిస్తున్నానని యూనివర్స్ తెలిపారు.

ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న హెచ్ఎం జానకిరామరెడ్డి

విజయపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు జానకిరామరెడ్డి మంగళవారం ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. బ్యాంకింగ్, ఐటీలో 15 రోజుల పాటు శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై శిక్షణ అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే రోగాలు దూరం



కిట్లను అందజేస్తున్న డీఎంవో వేణుగోపాల్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దరిచేరవని జిల్లా మలేరియా నివారణ అధికారి వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్ఆర్ పేట పీహెచ్‌సీలో బోదకాలు వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల్లో నీరు, చెత్త నిల్వ ఉండడం ద్వారా దోమలు వ్యాపిస్తాయన్నారు. దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా, బోదకాలు, చికున్‌గున్యా లాంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. అనంతరం బోదకాలు వ్యాధిగ్రస్తులకు డిసేబులిటీ ప్రివెన్షన్ కిట్లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి చంద్ర మహేష్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

వెదురుకుప్పం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవళంపేటలో మంగళవారం ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ జరిగింది.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ

వెదురుకుప్పం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గ్రామదేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పాలు, పెరుగు, తేనె, హరిద్రవం, పసుపు, కుంకుమలతో అభిషేకం చేశారు. రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

సారా కేసుల్లో ఇద్దరి అరెస్టు

పెనుమూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సారా కేసులో పరారీలో ఉన్న నిందితుడిని, సారా కాస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఎస్ఐ రామచంద్రయ్య కథనం మేరకు... సారా కేసులో నిందితుడైన ఎర్రమట్టిపల్లికి చెందిన కె.వెంకటేశ్ పరారీలో ఉండగా మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన కె.భాస్కర్ బాపనచెరువు వద్ద సారా కాస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రీసర్వేని సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ రమేష్ తదితరులు

పూతలపట్టు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటఅగ్రహారంలో నిర్వహించనున్న రీసర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమేష్ కోరారు. మంగళవారం పేటఅగ్రహారం గ్రామంలో రీసర్వేపై ర్యాలీ నిర్వహించారు. మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు, గణపతి నాయుడు, సీకే చిట్టిబాబు, డీటీ మునిక్రిష్ణ, రెవిన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను వినియోగించుకోండి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ, విద్యార్థులు వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు కథలు, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, చెస్, క్యారమ్స్, జీకే, పేపర్ క్రాఫ్ట్, క్విజ్ వంటి అంశాల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులచే శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీవరకు శిక్షణా తరగతులు ఉంటాయని తెలిపారు.





పాపసముద్రం వద్ద - చింతగుంటూరు వద్ద ప్రమాదకర మలుపులు

ఈ మలుపులు యమ డేంజర్

గుడిపాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లలో మలుపుల వద్ద పలువురు పడిలేచి గాయాలపాలవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గుడిపాల క్రాస్ నుంచి చిత్తపార, పల్లూరు మఠం నుంచి వయా చింతగుంటూరు మీదుగా బొమ్మసముద్రం క్రాస్, 190 రామాపురం నుంచి చుక్కావారిపల్లె, కొత్తపల్లె నుంచి కట్టకిందపల్లె, పేయనపల్లె క్రాస్ నుంచి చవటంతంగాల్ వరకు వెళ్లే రోడ్లలో అక్కడక్కడా ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద సూచికబోర్డులు, స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ద్విచక్ర వాహనాలకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహన చోదకులు కిందపడి గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ మలుపుల వద్ద సూచికబోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోళ్ల పెంపకంతో అధిక లాభాలు

● నెక్ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు



రైతులకు అవగాహన కల్పిస్తున్న నెక్ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, మాజీ చైర్మన్ రమేష్ తదితరులు

యాదమరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ రైతులు ప్రత్యామ్నాయ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఇంటిగ్రేటెడ్ బ్రాయిలర్, నాటు కోళ్ల పెంపకం చేపట్టాలని నెక్ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, మాజీ నెక్ చైర్మన్ రమేష్ బాబు, పశుసంవర్థక శాఖ జేడీ ఆరిఫ్ రైతులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు పాడి పరిశ్రమ మీదే ఆధారపడకుండా స్వయం సంపద సృష్టికి 'సంకల్ప' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... రైతులు పాడి పరిశ్రమల్లో అధిక పెట్టుబడులు పెట్టినా లాభాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని, ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా ఇంటిగ్రేటెడ్ బ్రాయిలర్ కోళ్లు, నాటుకోళ్ల పెంపకం వైపు మొగ్గు చూపి అధిక ఆదాయ వనరులు సృష్టించుకుంటే మంచి లాభాలను ఆర్జించవచ్చని అవగాహన కల్పించారు. బాలాజీ హేచరీస్ ఎండీ ప్రణీత్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడీ ఆసిఫ్, స్థానిక వెటర్నరీ డాక్టర్ సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దంటూ ధర్నా



మద్యం షాపు ఎదురుగా ధర్నా చేస్తున్న మహారాజపురం గ్రామస్తులు

విజయపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహారాజపురంలో మద్యం షాపు వద్దంటూ మంగళవారం ఆ షాపు ఎదుట గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం షాపులతో పాటు బార్‌లను తలపించే విధంగా డాబాలు ఏర్పాటు చేసుకోవడం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రీ పగలు తేడా లేకుండా మద్యం విక్రయిస్తుండడంతో ఆ దారిలో ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉందని వాపోయారు. మద్యం మత్తులో మందు బాబులు మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని, తరచూ గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. మద్యం బాటిల్‌పై రూ.10 ఎక్కువగా అమ్ముతున్నారని, అడిగిన వారిపై చేయి చేసుకోవడంతో పోలీసు స్టేషన్ వరకు పంచాయతీ వెళ్లిందని చెప్పారు. గ్రామంలో ప్రశాంతంగా ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం షాపును ఊరికి దూరంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి, విజయపురం ఎస్ఐ రంగా సంఘటనా స్థలానికి చేరుకొని ధర్నాను విరమింపజేశారు.

ఆలయ మాన్యం భూమి ఆక్రమణపై ఫిర్యాదు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆలయమాన్యం భూమిని ఆక్రమించారని పేర్కొంటూ ధర్మకర్తలతో పాటు రెండు పంచాయతీల సర్పంచులు, ఆలయ పాయకట్టు ప్రజలు కలిసి ప్రజాసమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు వివరాలు... గంగాధరనెల్లూరు మండలం వింజం పంచాయతీలోని సిద్ధేశ్వర స్వామి, వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి ఆలయానికి సుమారు 60 ఎకరాల భూమి ఉంది. ఆ పంచాయతీకి చెందిన ఇద్దరు టీడీపీ నేతలు సుమారు 5 ఎకరాల భూమిని ఎక్స్‌కవేటర్‌లతో చదునుచేసి ఆక్రమించుకోవడాన్ని నిరసిస్తూ సిద్ధేశ్వరకొండ, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ చైర్మన్లు వాసుదేవరెడ్డి, నరసింహారెడ్డి, వింజం సర్పంచి రామక్క, బాలగంగనపల్లె సర్పంచి శేఖర్‌లతో పాటు ఆలయ పాయకట్టులోని ప్రజలు వందమంది కలిసి సోమవారం చిత్తూరులో కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయ మాన్యం భూమిని ఇతరులు ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌కు విన్నవించారు.

27న ఉచిత నేత్రవైద్య శిబిరం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక రాముల వారి గుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఈనెల 27వ తేదీ ఉదయం 7 గంటల నుంచి చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు సుభాష్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల డాక్టర్ల సహకారంతో మధ్యాహ్నం 12 గంటల వరకు కంటి రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజలకు ఉపయోగపడని పనులను ఆపేయండి

● ఎంపీడీవోకు టీడీపీ నాయకుల ఫిర్యాదు





చెరువు కట్టపై ఉన్న గులకరాళ్లు - ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపయోగపడని రోడ్డు పనులను ఆపేయాలంటూ మండలంలోని వెంకటాపురానికి చెందిన టీడీపీ నాయకులు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మోహనమురళి, తహసీల్దార్ లోకనాథంపిళ్లైకి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఆర్‌పురం మండలం పిళ్లారికుప్పం - వెంకటాపురం మధ్యలో పెరుమాలక్క చెరువు కట్టపై అదే గ్రామానికి చెందిన ఓ నాయకుడు రూ.10లక్షల జడ్పీ గ్రాంట్ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. వెంకటాపురం పంచాయతీలో ప్రజలకు ఉపయోగపడని రోడ్డు నిర్మాణం వద్దని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా గ్రామంలో ఇప్పటికే ఉన్న మట్టి రోడ్లకు ఈ నిధులతో సీసీ రోడ్లు వేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామాభివృద్ధికి అధికారులు సహకరించాలని, లేకుంటే జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని టీడీపీ నాయకులు తెలిపారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో, తహసీల్దార్ హామీ ఇచ్చారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



నగరిలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ

నగరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కృష్ణవేణి తెలిపారు. పోషణ్ పక్వాడా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలచే ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో కృష్ణయ్య మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవాలని, పారిశుధ్య చర్యలు పాటించాలని, ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని తెలిపారు. పౌష్టికాహారం వాడాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే వారితో బాటు భావితరాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శంకరమ్మ, లక్ష్మి, గోపీనాథ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● పూతలపట్టు: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు నిర్వహించారు. సీడీపీవో నిర్మల, సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● బంగారుపాళ్యం: గర్భిణులకు సామూహిక సీమంతాలను ఎంపీపీ అమరావతి, సీడీపీవో వాణిశ్రీదేవి నిర్వహించారు. బంగారుపాళ్యం ఎంపీడీవో కార్యాలయంలో గర్భిణులకు వెయ్యి రోజుల సంరక్షణ ప్రాముఖ్యత, తల్లిపాల ప్రాముఖ్యత, పోషణ్ ట్రాకర్ స్వీయ నమోదు, ఆరు సంవత్సరాల లోపు పిల్లల బాగోగుల గురించి తల్లులకు వివరించారు. ఎంపీడీవో శ్రీధర్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పూతలపట్టులో గర్భిణులకు సామూహిక సీమంతం

● నింద్ర: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను అరికట్టగలమని ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీడీపీవో క్రిష్ణవేణి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. అంతకు ముందు ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ చేశారు. ఎంఈవో వసుమతిదేవి, వైద్య ఆరోగ్య సిబ్బంది గోపి, అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్యామల, అంగన్వాడీ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

● వెదురుకుప్పం: అధిక శక్తినిచ్చే ఆహార పదార్థాలను తీసుకోవాలని కార్వేటినగరం ఐసీడీఎస్ సీడీపీవో పద్మసునంద సూచించారు. కార్వేటినగరంలో గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులతో సమావేశమయ్యారు. పిల్లల్లో ఊబకాయం రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లను వివరించారు. సూపర్‌వైజర్లు శ్యామిని, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

● వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.శకుంతల తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

27నుంచి బాలలకు యోగాపై ఉచిత శిక్షణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సిద్ధ సమాధి యోగా శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో ఈనెల 27 నుంచి 10 రోజుల పాటు బాలల ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గురువులు నరేంద్రకుమార్, బ్రహ్మయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి, జగన్నాధ్ తెలిపారు. ఏడు సంవత్సరాల పైబడి 14 సంవత్సరాల వయసు కలిగిన బాలలకు సూర్య నమస్కారాలు, యోగ, ప్రాణాయామం, వ్యాయామాలు, ధ్యానం, చిత్రలేఖనం, కళానైపుణ్యం, నాయకత్వ లక్షణాల పెంపు, ఆటలు, నృత్యం, గాయత్రి మంత్రోచ్చరణ, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై ఉచిత శిక్షణ అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అదేవిధంగా గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో ఈనెల 27న సాయంత్రం ఉచిత సిద్ధ సమాధి యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరేంద్రకుమార్ తెలిపారు. సూర్య నమస్కారాలు, యోగా, ప్రాణాయామం, పంచకోశశుద్ధి, జ్ఞానబోధ, ఆహారపు అలవాట్లు, ముద్రలు, తదితర అంశాలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర ప్రారంభం

చౌడేపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్రెడ్డిపల్లెలో నడివీధి గంగ మ్మ జాతర అమ్మవారి కల్యాణంతో మంగళవారం ప్రారంభమైంది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలు, చెక్కభజనలు, కోలాటాల నడుమ పురవీధులలో ఊరేగించి నడివీధిలో అమ్మవారిని ప్రతిష్ఠించారు.

ఓగు పీహెచ్‌సీలో చోరీ యత్నం

వి.కోట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం ఓగు పీహెచ్‌సీలో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఆపేసిన అనంతరం ఆసుపత్రిలో కిటికీ అద్దాలు ధ్వంసం చేసి ప్రధాన ద్వారంలోనికి ప్రవేశించారు. అయితే లోపలి తలుపులు తీసేందుకు యత్నించినా రాకపోవడంతో అందుబాటులోని కొన్ని మందు సీసాలను కిందపడేసి నిరాశగా వెనుదిరిగినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఐ సోమశేఖర్‌రెడ్డికి వైద్యాధికారిని మాధవి ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలోని సీసీ కెమెరాలు పరిశీలిస్తే దుండగుల జాడ తెలియనుంది. పోలీసులు ఆ దిశగా విచారణ చేపడుతున్నారు.